క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

మర్యాద పూర్వక కలయిక



వైవీ సుబ్బారెడ్డికి మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని మంగళవారం ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందజేశారు. కార్యక్రమంలో 94వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యామ్నాయ వివాద పరిష్కార సదస్సు



సదస్సులో పాల్గొన్న డీఎస్‌ఎన్‌ఎల్‌యూ వీసీ డాక్టర్ శ్రీసుధ తదితరులు

సబ్బవరం: ప్రత్యామ్నాయ వివాదాల పరిష్కారాన్ని వృత్తిగా ఎంచుకుని రాణించాలనుకునే న్యాయ విద్యార్థులకు రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సు ఉపయుక్తంగా ఉంటుందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయ ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య డాక్టర్ శ్రీసుధ తెలిపారు. డీఎస్‌ఎన్‌ఎల్‌యూలో వివాద పరిష్కార ప్రత్యామ్నాయాలు అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సు మంగళవారంతో ముగిసింది. చివరిరోజు ఆర్బిట్రేషన్, లిటిగేషన్‌కు సంబంధించి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ అందించారు. కార్యక్రమంలో భాగంగా డీఎస్‌ఎన్‌ఎల్‌యూ, ముంబై సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జోగినాయుడు, ముంబై సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెక్రటరీ జనరల్ నీతి సచ్‌దేవా ఎంవోయూలపై సంతకాలు చేసి పరస్పరం ఒకరికొకరు మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఆర్బిట్రేషన్‌లో మెళకువలు నేర్పుతారని తెలిపారు.ఫ్యాకల్టీ కన్వీనర్ ఆర్‌వీ విష్ణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'భారత ప్రశస్థి' పద్య రూపకం



పద్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: శ్రీలలితాపీఠం ఆధ్వర్యంలో విశాఖ సాహితి సహకారంతో పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి సమక్షంలో నన్నయ మహాభారత రచన సహస్రాబ్ది ఉత్సవాల్లో భాగంగా భారత ప్రశస్థి అనే పద్య రూపకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాజరాజ నరేంద్రుడిగా డాక్టర్ పేరి రవికుమార్(విశాఖ), నన్నయగా డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ (నరసాపురం), తిక్కనగా శ్రీకోట వెంకటలక్ష్మీ నరసింహం (తణుకు), ఎర్రనగా తాత సత్యసందీప్ శర్మ(విశాఖ),నారాయణబట్టుగా ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ(హైదరాబాద్) నన్నయ భారత రచన ప్రస్థానాన్ని అలాగే రాజరాజ నరేంద్రుడి ప్రోత్సాహాన్ని పద్యరూపకంలో కడు రమ్యంగా ప్రదర్శించారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా విశాఖసాహితి అధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని వ్యవహరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, విశాఖ సాహితి కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సంపూర్ణ పోషణ... ఆరోగ్యానికి రక్షణ

- గర్భిణులు,బాలింతలకు ఇంటికే డ్రై రేషన్
- భావి భారతావని ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

గర్భిణులు ఆరోగ్యంగా ఉంటే వారికి జన్మించే సంతానం ఆరోగ్యంగా ఉంటారు.బాలింతలు బలమైన ఆహారం తీసుకుంటే పిల్లల ఎదుగుదల సక్రమంగా ఉంటుంది.అందుకే మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది ప్రభుత్వం.ఆరోగ్యవంతమైన భావితరాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్నారు. గర్భిణులు,బాలింతల పోషణను దృష్టిలో పెట్టుకుని ఇళ్లకే పోషకాహార కిట్లు అందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



సబ్బవరం కోమటవీధిలోని అంగన్‌వాడీ కేంద్రం



పెదయాతపాలెంలో పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ రుణాన్సీ లక్ష్మీరాణి తదితరులు

సబ్బవరం: పేదరికం కారణంగా సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో గర్భిణుల్లో రక్తహీనత సమస్య ఎదురవుతుంది.వారికి పుట్టిన బిడ్డలకూ అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం అదనపు పౌష్టికాహారం అందిస్తుంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులకు గతంలో ఇచ్చే బియ్యం,పప్పు,పాలు,గుడ్లుకు అదనంగా మరో ఆరు రకాల పోషక పదార్థాలు అందిస్తుంది. వాటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనివ్వగలరు.

ఆ కష్టాలకు చెక్

గర్భిణులు,బాలింతలకు గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం తయారు చేసి పెట్టేవారు.దీంతో వారు ప్రతి రోజు కేంద్రానికి వెళ్లలేకపోవడంతో పాటు కేంద్రంలో భోజనం చేసేందుకు కొంత ఇబ్బంది పడేవారు. దీంతో పాటు కేంద్రానికి సరైన సమయానికి వెళ్లలేక కొంతమంది పాలు,గుడ్లు మాత్రమే తీసుకునివెళ్లేవారు. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం వారికి అనుకూలంగా ఉండే విధంగా నిర్ణయం తీసుకుంది. రోజూ కేంద్రాలకు రాకపోయినా వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పోషణ పథకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. వారి ఇళ్ల వద్దకే సరుకుల కిట్లు అందిస్తున్నారు. నెలకు ఒకసారి డ్రై రేషన్ కిట్లు అందజేయడంతో వారి ఇబ్బందులు తొలగాయి. సంపూర్ణ పోషక విలువలున్న ఆహారాన్ని వారికి నచ్చిన విధంగా తీసుకుంటూ ఆరోగ్యంగా ఉంటున్నారు.

కిట్‌లో సరుకులు : వైఎస్సార్ సంపూర్ణ కిట్‌కు రూ.850కు పైగా ఖర్చు చేస్తున్నారు. అందులో మూడు కిలోల బియ్యం,కిలో కందిపప్పు, అరలీటర్ ఆయిల్, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు ఉన్నాయి. అయితే ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు ఇస్తుండగా మరో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద రెండు కిలోల రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల వేరుశనగ చెక్కీలు,250 గ్రాముల కర్జూరం,250 గ్రాముల బెల్లం అందిస్తుంది.దీనిపై అంతటా ఆనందం వ్యక్తమవుతుంది.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లలో రాగి పిండి,చెక్కీలు,కర్జూరం,బెల్లం వంటి సరకులు ఉంటున్నాయి. దీంతో నా బిడ్డకు సంపూర్ణ పోషక విలువలు ఉన్న ఆహారం అందుతోంది.చిన్నారి ఆరోగ్యంగా ఉంటున్నాడు. బాలింతల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– సింగంపల్లి రంగమ్మ, బాలింత, మల్లునాయుడుపాలెం

నాణ్యమైన సరకులు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లలో నాణ్యమైన సరుకులు ఇస్తున్నారు.ఆ సరకులను మార్కెట్లో కొనాలంటే ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తుంది. ప్రతి రోజూ నేను ఈ ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నాను. నాకు పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా జన్మిస్తుందని ధైర్యంగా ఉంది.

– భోజంకి లోవదేవి, గర్భిణి, మల్లునాయుడుపాలెం

సంతోషంగా..



గతంలో భోజనానికి అంగన్‌వాడీకి రావడానికి బాలింతలు,గర్భిణులు ఇబ్బందులు పడేవారు.అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లలేక ఇంట్లోనే తినేవారు.కేవలం గుడ్లు,పాలు మాత్రమే ఇంటికి తీసుకు వెళ్లేవారు.ఈ కిట్లు ఇంటికి అందించడం ద్వారా వారి ఇబ్బందులు తొలగాయి.సంతోషంగా తింటున్నారు.

– రొంగలి పైడితల్లి, క్లస్టర్ సూపర్ వైజర్, సబ్బవరం.

802 మందికి కిట్లు



సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సబ్బవరం మండలంలో 87 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.వీటిలో 72 మెయిన్ అంగన్ వాడీ కేంద్రాలు కాగా 15 మినీ అంగన్‌వాడీలు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో 450 మంది గర్భిణులకు, 352 మంది బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లు అందిస్తున్నాం.

– లలిత్ కుమారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి, సబ్బవరం.

వైభవంగా నరసింగిబిల్లి అమ్మవారి పండగ



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: నాయుడుతోటలోని నరసింగిబిల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి చీరలు, పసుపుకుంకుమలు సమర్పించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, వైఎస్సార్‌సీపీ నాయకులు అద్దాల రామరాజు, ఆదిరెడ్డి మురళి, కృష్ణ, వర్మ, రాజు,నరసింగరావు, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని నిరసన

పరవాడ: సమగ్ర శిక్షాలో వివిధ కేటగిరిల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని మండల జేఏసీ ప్రతినిధి బి.గోపాలరావు డిమాండ్ చేశారు.స్థానిక మండల విద్యా కేంద్రం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సొసైటీలో 2012 నుంచి ఎంఐఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్, మండల లెవెల్ అకౌంటెంట్, సీఆర్పీలు, ఐఈఆర్‌టీ, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్షా సొసైటీలో రెగ్యులర్ చేసి పనికి తగ్గ వేతనం అమలు చేయాలన్నారు. ప్రతీ నెలా ఒకటోతేదీ నాటికి జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ సీహెచ్. నాగేశ్వరరావు, ఐఈఆర్‌టీ జి.శ్రీనివాసరావు, పీటీఐ ఎం.వరప్రసాద్ పాల్గొన్నారు.

సింహగిరిపై ఘనంగా నృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతీ నక్షత్రం పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతీనక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నృసింహ హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి అక్కడ ఉన్న హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహావచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శ్రీకాంతాచార్యులు తలపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు.ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం అర్చకుడు పవన్‌కుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

చంద్రయాన్-3 విజయవంతం కావాలని..



జాతీయ పతాకం రంగులతో కూడిన బెలూన్స్ ఎగురు వేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, విద్యార్థులు

సింహాచలం: చంద్రయాన్-3 చంద్రుడిపై బుధవారం సాయంత్రం ల్యాండ్ అవుతుండడంతో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు జాతీయ జెండా రంగులతో కూడిన బెలూన్స్ ఎగుర వేసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రయాన్-3 ప్రయోగం ఒక చరిత్ర అని, ఎలాంటి ఆటంకం లేకుండా చంద్రుడిపై ల్యాండ్ కావాలని కోరుకుంటున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. కళాశాల సెక్షన్ హెడ్‌లు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- సేనాతివానిపాలెంలో ఉత్సాహంగా గడప గడపకు..



సేనాతివానిపాలెంలోఅభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: గడప గడపకు మన ప్రభుత్వానికి ప్రతీ చోట ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారని, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నామని ప్రజలు చెబుతుంటే సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 94వ వార్డు 521 సచివాలయం పరిధిలోని సేనాతివానిపాలెంలో మంగళవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాము ధైర్యంగా తిరుగుతున్నామంటే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మంచే అని తెలిపారు. కులమతాలు, వర్గాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి వృద్ధుల కళ్లల్లో ఆనందాన్ని నింపారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డినే అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యలను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తవగానే వచ్చే నిధులతో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సేనాతివానిపాలెంలో రూ.18 లక్షల జీవీఎంసీ నిధులతో చేయనున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్లు, సీసీ డ్రైనుల నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పనులను త్వరితగతిన చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-8 జెడ్సీ మల్లయ్యానాయుడు, 94వ వార్డు వార్డు ఇన్‌చార్జి నర్సింగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సూరిశెట్టి సూరిబాబు, బల్ల రాంబాబు, చెల్లారావు, నాయుడు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

చెత్త తొలగించరూ!



ముత్యాలమ్మపాలెంలో ఓ వీధిలో పేరుకుపోయి చెత్తాచెదారాలు

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. గ్రామంలోని పురవీధులు, రోడ్ల వెంబడి ఎక్కడికక్కడ చెత్తా చెదారాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. కాలువలను కూడా శుభ్రం చేయకపోవడంతో దోమలు విజృంభించి రాత్రి వేళ కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు అరిజిల్లి మసేనుమ కోరారు. సమస్యను సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు దృష్టికి తీసుకువెళ్లగా దోమల నివారణకు మందులు పిచికారీ చేస్తున్నామని చెప్పారు.

అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయండి


'టిడ్కో'అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

పరవాడ: గొర్లివానిపాలెం సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల కాలనీలో అసంపూర్తి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. గొర్లివానిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ వద్ద గల టిడ్కో ఇళ్ల కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ మంజూరు చేసిన 512 టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయినట్లు వెల్లడించారు. వీటిలో 500 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేశామన్నారు. కాలనీలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ సదుపాయాలను కల్పించామన్నారు. సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వచ్చే 10 కల్లా పూర్తి చేసి ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని టిడ్కో హౌసింగ్ కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్‌ను ఆదేశించారు. జెడ్సీ సింహాచలం, ఏపీడీ రాము, సీఎల్‌టీసీ దేముడుబాబు, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టే యత్నమే ప్రైవేటీకరణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన దీక్షల్లో 922వ రోజు మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జలమయం



సబ్బవరం పోలీస్ స్టేషన్‌లోకి చేరిన వర్షపునీరు



ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

సబ్బవరం: సబ్బవరం మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో సబ్బవరం పోలీస్ స్టేషన్‌తో పాటు ఆనుకుని ఉన్న ప్రధాన రహదారి జలమయం అయింది. ఇటీవల ప్రధాన రహదారిని అభివృద్ధి చేసినప్పటికీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైన్లు పూర్తి చేయలేదు. మరో వైపు డ్రైన్‌లలో పూడిక తొలగించకపోవడంతో ఈ ప్రాంతం తరుచూ ముంపునకు గురవుతోంది.పోలీస్‌స్టేషన్ నుంచి సుమారు కిలో మీటర్ దూరంలో ఉన్న సాయినగర్ నుంచి వర్షపు నీరు రోడ్డు పాడువునా ప్రవహించి ఇక్కడకు చేరడంతో ఈ ప్రాంతంలో నీరు చేరి చెరువును తలపిస్తోంది. సబ్బవరం పోలీస్ స్టేషన్ ముంపునకు గురికావడంతో పాటు ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయం కలిగింది.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097
సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com